

# నిష్క్రమణ ద్వారం

— మునిపల్లె రాజు

పంజరం ఊగిపోతున్నదెందుకో?
పచ్చరెక్కల చిలుక ఎగిరిపోయిందా?

★

ఏమిటో మత్తుగా ఉంది. ఎందుకో కలతగా ఉంది. తన పేరు జ్ఞాపకం రావటం లేదు. తన కళ్ళు తెరిపిన పడటం లేదు.

బలవంతంగా కళ్ళు తెరిచే ప్రయత్నం చేశాడు. ఒక సుదూర సైకత శ్రేణి లో లోపలి పొరల్లో చిన్న శతఘ్ని పేలుడు సంభవించినట్లైనది. సృష్టి విన్యాసం ప్రావిర్భవించకముందున్న నిశ్శబ్దం —ప్రణవనాదం ఆవిర్భవించని అనాది కల్పాల శబ్ద రాహిత్య నిశ్చలత్వం —భంగమైనట్లయింది. ఆ వెనుక ఒక అస్పష్ట దృశ్యం.

తన చుట్టూ పలచటి తెర. సడలిపోతున్న శంకాకుల సంధ్య. తన మంచం నిశ్శబ్దంగా కదిలిపోతున్నది. తను సాధారణంగా నిద్రించే కింది అంతస్థు గది కాదే ఇది! మేడమీది ఈ గదిలోకి తనెప్పుడు వచ్చాడు? విస్మృతపథంలో నడుస్తున్నవాడికి —ఒక స్మృతి శలాక ఎదురుగా నిలిచి ఢీకొనబోతోంది.

నడుస్తున్న మంచం ఒక ద్వారం సమీపాన స్తంభించిపోయింది. ఆ ద్వారం తలుపులు ఓరగా తెరిచిఉన్న భావన. ద్వారబంధం మీద ఎర్రని అక్షరాలు "బయటకు పోవు దారి" హఠాత్తుగా ప్రత్యక్షం.

ఎంత పేలవంగా ఉందీ పేరు? ఇది సినిమాచిత్రాల శాలా? రైల్వే స్టేషనా? బస్సు డిపోనా? అతని అతిలోక భావుకత్వం ఆ పేరును నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తుండగా మళ్ళీ నిర్వాణస్థితి ఆవహిస్తున్నది. కాని అంతరంతరాల, కాంతిఛాయల్లో శబ్ద స్తోత్రానికి ఉపక్రమించాడు. ఏవీ అమాయిక గోపికా స్త్రీల చరణ మంజీరాలు? ఎక్కడ మాతృదేవత భజన కీర్తనల మధుర మంజీరాలు?

ఇంతలోనే లయ తప్పిన పాటవలె తన చుట్టూ ఒక కలకలం. ఆ నీలి నీలి సాగర ప్రశాంతంలో మానవజాతి ప్రవేశం. యోగసమాధికి ఒక ఆటంకం.

"పఠాభీ ——కళ్ళు తెరిచి చూడు"

"ఇదిగో ——నే నెవర్నో చెప్పుకో"

"ఏమిటా మాటలు ——స్పష్టంగా పలుకు"

"——"

"సంధిమాటలు తల్లీ!" (దేనికి దేనికి సంధి?)

"ఇడుగో నువు పెంచినవాడు ——ఏమైనా చెబుతావా?"

"ఇక పస్తాయించొద్దమ్మా —కింద పెట్టండి"

"చాప పరచండి. నాలుగు తులసీదళాలు——"

"ఎవరన్నా ఒక రాగి డబ్బివ్వండర్రా"

ఓంకార పంజరం నుండి రామచిలుక బయట పడ్డది. ఆగమ విపినాల్లో ఆడుతున్న నెమలి పింఛగుచ్ఛాన్ని ముడుచుకొన్నది. ఆది తాళంలో ఒక ముక్తాయింపు —తద్ధి —తక తధిమిత —కిటతక ఝుంతా —తక తతోంగ దిరిగుడు.

ఓహో —తన పేరు పఠాభి అన్న మాట. తన తల్లికి ఒకనాడు —చిన్ననాడు —పట్టు బాబు, పట్టి నాన్న. తన తండ్రికో? తెలియదు. లోకానికీ? అప్పటప్పటి తన గాథల బాధల నేపథ్యంలో

పట్టాయ్ ——పట్టుగాడు ——నత్తివెధవ —ఏ మూలా నక్షత్ర దోషంలో పుట్టాడో ——ఇనుము జాతకుడు. ఆ తర్వాత గూడా ఎన్నో పేర్లు —, మేజర్ పఠాభి, అతి విశిష్ట సేవా మెడల్, భారత సైన్యం (రిటైర్డ్). ఇప్పుడిప్పుడే —పఠాభిగారు. శ్రీమాన్ పఠాభి రామారావ్ జీ. దాత. దయామయుడు! ధీరుడు!

పఠాభి ఒకే ఒక గుక్క తులసిజలం మింగి గుటకవేశాడు. రెండవ ఉద్ధరిణకు పళ్ళు బిగించి నిరాకరించాడు. గొంతులో గురగుర శబ్దం సమసిపోయింది. ఒక త్రేనుపు వచ్చింది. సన్నగా ఒక తుమ్ము తుమ్మాడు. చుట్టూ చేరిన జనం స్పష్టంగా విన్నారు.

"తిప్పుకొంటున్నాడు —తిప్పుకొంటున్నాడు"

"మొదట్నుంచీ గట్టిపిండం కదా!"

ఎవరిదో నుదుటిమీద శీతలహస్త స్పర్శ. ఒక ప్రాచీనకాలాల జ్ఞాపకం. అవును, ఈ హస్తాన్నే తను సైన్యం నుండి విడుదల పొంది, కురుక్షేత్రం వద్ద కాందిశీకుల శిబిరం నుండి ఒక కన్య న్నేనుకొని పాణిగ్రహణం చేసిన నాటి అనుభూతిది. దమయంతిది. బ్రహ్మసరోవరం. భీష్మ పితామహుడి అంపశయ్య. పద్దెనిమిది అక్షౌహిణుల సైన్య నివహం. ఎవరిదో ఒక రుద్ధకంఠం. వినీ వినబడని విలాపం. అదీ పరిచిత —నిగూఢ రాగమే. ఒకనాడు —ఒక రైల్వేస్టేషన్ పరిధిలో ఒక అనాథ బాలుడి కంఠస్వరం. తనతోపాటు వచ్చినవాడు —ధృవకుమార్. తను పెట్టిన పేరేనా?

ఆ క్షణంలో పఠాభి ఒక వ్యక్తిగాడు. ద్వంద్వుడు. బాహ్యశబ్దాల వేదనా సూక్తాన్ని ఆలకిస్తున్నదొకరు. అంతఃశ్రుతుల్ని సరిచేసుకుంటున్నదింకొకరు. ఇద్దరి మధ్య రహస్య సంకేతాలు, యుగళ గీతాలు. పఠాభికి మరొక తుమ్ము వచ్చింది. పెద్ద శబ్దం. కళ్ళు విడివడుతున్నవి. ఎదురుగా ఒక కాంతివంతమైన దీపం వెలుగుతున్నదేమో. ద్వారబంధం మీది రక్తాక్షరాలు మాయమై వాటి స్థానే నీలాకాశపు రంగులో "నిష్క్రమణ ద్వారం" అన్న నవ్యాతినవ్యమైన పంక్తి గోచరించింది. కనులకింపైన గంభీర ధీర నీరవమైన రంగు. చెవులకింపైన ఆ శబ్దంలో క్లేశరహిత శాంతి. మేజర్ పఠాభి మత్తు మాయమైపోయింది.

ఓహో, ఇదా సంగతి, ఈ రహస్య సంకేతాల టిప్పణి? ఇది తన మరణదృశ్యం. ఒక్క నిమిషంలో జారిపడనున్న తెర అక్కడే నిలిచిపోయింది. ఇన్నేళ్ళుగా ఈ జీవిత నాటక రంగస్థలి మీద తన నాడించిన పాత్రలు, పాడించిన పాటలు, పలికించిన మాటలు చరమాంకానికి చేరినవి., కాని యవనికకు ఏ విధి రహస్యహస్తమో అడ్డువచ్చింది. తను పునర్జన్మ పొందటం ఇది మూడవసారి. ఈ తృతీయ ప్రాణదానం , బేషరతుగా లేదు. ఎదురుగా —నిష్క్రమణ ద్వారం. మూడు నెలలుగా తన రోగం. రుజాగ్రస్త శరీరం. మంచంలో పడక. ఎవరెవరో భిషగ్వరుల మందులు. ఏవేవో కాషాయ కిరీటాలు. వెను వెంటనే కావేష సరీసృపాలు. యమకింకరులు —విష్ణుభటులతోనూ శివశక్తులతోనూ చేసిన వ్యర్థ పోరాటం. దీనినంతా తిలకిస్తూ, రోదిస్తూ, నిస్సహాయులుగా నిలిచిన తన కుటుంబ సభ్యుల అప్తుల, మిత్రుల గుప్తశత్రువుల ఆరాటాలన్న మాట తన చుట్టూ చెలరేగిన కోలాహలం.

తన శవానికి తాను మూడు మాసాలుగా కాపలా కాచిన దృశ్యం —తుడుచుపెట్టకపోయింది. ఒక కల. ఒక యోగముద్ర. ఒక యుద్ధ నినాదం. ఇప్పుడు తన శక్తినంతా కూడగటంటుకొంటున్నాడు. తన ప్రాణదానానికి నాంది అయిన అపరిమిత అయుర్ధారిణీ మంత్రం జ్ఞాపకం రావటం లేదు.

ఓరగా తెరిచి ఉన్న కాలద్వార కవాటం, ఆ నిష్క్రమణద్వారం —తనను అశాంత పరిధిలోకి ఆకర్షిస్తున్నది. తననుండి సమాధానం కోరుతున్నది. ఒకప్పుడు కాలం తన మిత్రువు. ఇప్పుడు కాదు. కిం కర్తవ్యం? వ్యవధి లేని క్షణం. ఆ ద్వారాన్ని మూసివేయాలా, ఈ బలహీన శరీరానికి మనస్సుకు తిరిగి సంపూర్ణ శక్తి సమకూర్చాలా? లేక పూర్తిగా స్వేచ్ఛగా తెరిచి తను శాశ్వతంగా నిష్క్రమించాలా? ఈ లోకానికి, తన బంధుమిత్రులకూ, ఈ దేశవాసులకు తన సేవలవసరమా? లేదా?

మేజర్ పఠాభి ఆ దుఃఖ వేదిక నుండి తన ద్వంద్వుడితో —తన జీవితపర్యంతాన్ని సింహావలోకనం చేసుకొంటున్నాడు. ఏది ముందు? ఏది వెనుక? ఇది కందిరీగల ముసురు. ఇది శలభ సంతానపు సందడి —ఈ ముందు వెనకల తోపులాట. తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలను ఏకనిష్ఠతో గమనిస్తూ జ్ఞాన ప్రాణాయామంలో ఉన్నాడిప్పుడు. సమాధానం లభించాలి. నిష్క్రమణద్వారం సంగతి తేలాలి. హే భగవాన్, హే భరత ధాత్రీ, హే వేదమాతా —మీ సంకల్పం ఏమిటి? నత్తిని జయింపజేశారు. మూడుసార్లు మిత్తిని జయింపజేశారు. ఇప్పు డెందుకు నిశ్శబ్దం వహిస్తున్నారు?

## II

యోగనిద్రలో ఉన్నవాడికి తన జీవిత మహాభారత సంగ్రామం, ద్వాపరయుగం నాటి జ్ఞాపకాల్లో ఇమిడి ఉన్నట్లయి మళ్ళీ నిస్త్రాణ కమ్ముతున్నది. అయినా మాతృస్తవంతోనే సింహావలోకనం.

కొండను చుట్టి వచ్చిన వాగు. వాగు పక్కన ఊరు. ఊరి చివర పర్ణకుటీరం. విశ్వజనని వంశీ నాదాలు తన చుట్టూ. కాని తను మూగవాడు. నత్తితో ఒకటి రెండు ముద్దమాటలు. ఆ వంశీగానాన్ని ఆలపించాలని ఆవేదన. సోమేశ్వరుడు, వేణుగోపాలుడు గర్భగుళ్ళనుంచి తన మొరాలకించరు. అమ్మ తన పనుల్లో నిమగ్నమై వైశ్యవనిత ఆదెమ్మ ఇంటి వరండాలో తనను విడిచినప్పుడు, ఆమె చెప్పే కథలు వింటూ, నిస్సంతువుగా ఆమె పడ్డ ఆందోళనల అర్థం తెలియక దిగులుపడుతూ, ఎక్కడో అడవి మధ్య అగస్త్యేశ్వరుడి గుడిలో భర్తతో పాటు దీక్షా మండలాలు ఐదేళ్ళుగా నిర్వర్తించిన అనుభూతుల్తో చకితుడై, అప్పుడప్పుడు హఠాత్తుగా దర్శనమిచ్చే తాపసులు చూపిన మహిమలు కళ్ళకు కడుతుంటే, తన చిరంతన స్వప్నలోకం నిదురకు ఆహ్వానిస్తుంటే లొంగిపోయిన తన శైశవం ఒక స్వర్గలోకం. అంతలోనే అమ్మకు అవసానదశ ముంచుకొస్తుందని పఠాభికి తెలియదు గదా. తను పుట్టిన నెలలోనే ఎవరో బందిపోట్లు అశ్వారూఢులై వచ్చి నిశిరేయిలో ఆ ప్రాచీన దేవళాన్ని దోచుకొని తన తండ్రిని చంపిపోయిన కథ గూడా ఆదెమ్మే చెప్పింది.

అమ్మా, ఆదెమ్మా కలిసి వాగులో నీటికై బిందెలతో దిగి, అకాలంగా వచ్చిన వరద ఉధృతిలో అదృశ్యమవటం, మృత్యుశబ్దంతో తన ప్రథమ పరిచయం. తను భయకంపితుడై వరదనీటి ముందు నిలిచినప్పుడు వచ్చిన ఆక్రోశం —అమ్మా అమ్మా —అని రెండు శబ్దాలు. మూగతనం మాయమైపోయింది. నత్తి లేదు, శోకం మిగిలింది. భార్యా వియోగాగ్నితోనే, తనను భుజం మీది కెత్తుకొని ఆదెమ్మ భర్త —దూర గ్రామానికి నడిచి, నడిచి —తన వేలిడిచిన మేనమామల ఇంట్లో విడిచిపోవటం. అక్కడి ఆకాశం రంగు వేరు. ఆ నక్షత్రాలు తనను పలకరించవు. అక్కడ వంశీనాదం వినిపించదు. ఆదెమ్మ భర్త రంగయ్యగుప్తకు హృదయ నమస్కారం అర్పించటానికి ఒక్క క్షణికకాలం అతని సంవేదన ఆగిపోయింది. విధి ఇంత క్రూరంగా తన అభియనిలయాన్ని బాల్యాన్ని ధ్వంసం చేసిందో అప్పుడు సమాధానం లభించలేదు. తర్వాత కొన్నేళ్ళకు సన్యాసిబృందంతో తను హిమాలయాల్లో సంచరిస్తున్నప్పుడు లభించింది. గుడి ధ్వజస్తంభపు చిరుగంటల నిస్వనాలు తను మళ్ళీ ఈ కొత్త పరిసరాల్లో వినలేదు.

పెద్ద మేనమామ గతించాక తనది కుక్కబతుకు —ఊరికుక్క బతుకు. ఈసడింపుల ముళ్ళ మధ్య, శారీరక మానసిక హింసా వలయంలో, తనకే హక్కూ లేని బ్రతుకుకు ఏ అర్థమూ గోచరించని ఆ దశలో గూడా పాఠశాలను అశ్రద్ధ చేయలేదు. లెక్కలకన్నా, విజ్ఞానశాస్త్రాలు, వాటిని మించి మానవజీవన వైచిత్ర్యాల కథలు ముద్రపడినట్లుగా హృదయంలో నిలిచిపోయేవి. ముఖ్యంగా మూడు కథలు —భోపాల్ సన్యాసి గాథ, పునుగులమ్ముకొనే పున్నయ్య —దివాన్ బహదూర్ పూర్ణయ్యశ్రేష్ఠిగా ఎదిగిన కథ, ఆంగ్లంలో రిప్‌వాన్ వింకిల్ విచిత్రోపాఖ్యానం. ఈ కథా త్రయంతో తన జీవితం ముడిపడి ఉంది, తన భవిష్యత్తు ఆ మార్గంలోనే ప్రస్థానం చేయబోతోంది —అని నిరంతరం తోచేది. చాలీచాలని తిండిగాని, పశుప్రాయమైన మేనమామ భార్య చేయించే చాకిరిగాని, తనకన్నా బలీయులైన ఆమె కొడుకుల దెబ్బలుగాని, తనను స్వప్న ప్రపంచం నుండి వేరు చేయలేకపోయాయి.

పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు, వీధి మలుపులో అభిశప్తురాలైన అప్సరకన్యగా కనిపించి, తన భర్త అమానుష క్రౌర్యానికి నిత్యమూ బలి అవుతూ గూడా తనను ఆదరించే చిట్టెమ్మ, హనుమాన్ల గుడిలో పెనవేసుకొని జమిలి నాగసర్పాలలాగా తోచే రావిచెట్టూ, వేపచెట్టూ చప్టామీద తపస్సు చేసుకొనే అంజన్న తాత —తనకా గ్రామంలో ఆప్తులు. కాలప్రవాహంలో కాయితపు పడవలాంటి తన జీవితానికి ఆశాదీపాలు. పానకం, పడపప్పూ కొబ్బరిముక్కలతో తన శారీరక క్షుద్బాధను తీర్చిన అంజన్న తాత తన ఆధ్యాత్మిక అనుభూతులకూ మానసిక దార్ఢ్యానికి దారి చూపిన వాడు. పూరక రేచక స్తంభక ప్రాణాయామ నియమాలు నేర్పాడు. ప్రాణధాతువులను ప్రజ్వలింపజేసే యోగ ప్రక్రియల దారి చూపాడు. ఆయుదుద్ధారణ మంత్రం నేర్పించాడు. "చిరంజీవివి. పో" అని ఆశీర్వదించేవాడు. ఈ స్వల్ప బాల్య కౌమార దశలోనే ఒక జీవితకాలం అనుభూతికి వచ్చింది. చిట్టెమ్మ తన కన్నీళ్ళు తుడిచి తలదువ్వేది. తన తల కుదురుగా ఉన్న రోజున ఇంట్లో దెబ్బలు భరించేవాడు.

మళ్ళీ ఇంకో మలుపు —తన పరీక్ష తప్పాడు. అంజన్న తాత మాయమైనాడు. చిట్టెమ్మ ఏటిలో దూకినప్పుడు తను ఈదుకు వెళ్ళి రక్షించాడు. ఇద్దరికీ రంకులు కట్టి చిట్టెమ్మ రాక్షస భర్తా మేనమామల కొడుకులూ తనను స్తంభానికి కట్టివేసి కొట్టిన దెబ్బలకు తాత్కాలిక మరణం. ఆ భయంతో వాళ్ళు తనను చాపలో చుట్టి నది ఈవలి తుప్పల్లో పారవేయటం, తనను కాపాడిన ప్రాణాయామ విద్య, ఆ బురద నుండి దక్షిణాది యాత్రల నుండి తిరిగివస్తూన్న సన్యాసి బృందం కాపాడటం, విభూతి లేపనంతోనే తన గాయాలన్నీ మాయమవటం, ఇక బైరాగుల్తో ఉత్తరభారత పర్యటన, హిమాలయాల దర్శనం, మానస సరోవర యాత్ర, ఆ యాత్రలో ఒక మహాయోగి సందర్శనం. ఆ మహా యోగిపుంగవుడు ముప్పదిమూడుసార్లు కైలాసపర్వత పరిక్రమణ చేసినవాడు. ఆయుర్వేద మూలికల రహస్యాలు తెలిసినవాడు. ఆయన స్వామి ప్రణవానంద. భారతదేశ సరిహద్దుల మీద కన్నువేసిన చైనా సైన్యాధికారుల ఎత్తుగడలను భారత ప్రభుత్వానికి తెలిపిన మహితాత్ముడు. ఈ హిమాలయ శ్రేణుల్లో, నదీనద తీరాల్లో, అసదృశ పుష్పవనవాటికల్లో, నైమిషారణ్యంలో, వారణాశిలో నాథ్ సంప్రదాయ సాధు సమాజం, రామానంద్ పంథ్ గోస్వాములు, ప్రయాగలో భీతిగొలిపే నాగ సాధువులు, దిగంబరులు, వైష్ణవీయ, శాక్తేయ అఖండా సన్యాసులు, ఉదాసీన బైరాగులు, కరచరణాలకు ఇనుప సంకెళ్ళతో ఎందరో బాబాలు —గడచిన యుగాల్ని దర్శించాడు. అప్రయత్నంగా ఎన్నో భాషలు అవలీలగా నేర్చాడు. మద్యమాంసాల తాంత్రికుల

పతాభి అసాధారణ ప్రజ్ఞ మరతుపాకుల వేదాన్ని అధ్యయనం చేయడం. తన తోటి సైనికులకు అన్ని నిబంధనలనూ నెట్టివేసి యోగవిద్యను నేర్పటంలో, ఆయుర్ధారిణీ మంత్రజపం ఉపదేశించటంలో, మృత్యుంజయ మంత్రంతో మెషిన్‌గన్‌ను సంధించటంలో, ఘనీభవించిన చలిలో హెవీ మెషిన్‌గన్స్‌ను కాపాడటంలో విదితమైంది.

చేతిలో త్రిశూల ఘాతాలు తిన్నాడు. కాని ఎక్కడా క్షుద్ర మాంత్రికశక్తులు ఎన్ని అవకాశాలు వచ్చినా నేర్చుకోలేదు. ఆజానుబాహువైనాడు —అఖండ బలశాలి అయినాడు. కాని తనకు సన్యాసాశ్రమం ఇప్పించమని ఎంత ప్రాధేయపడ్డా పెద్దస్వాములు అంగీకరించలేదు. చివరకు తనను నైనితాల్‌లో వదిలి సన్యాసులు తరలిపోయారు. ఈ సప్త సంవత్సరాల్లో తనకు భాషలే గాదు, వేదసూక్తాలే గాదు, గీర్వాణ శ్లోకాలే గాదు ఆర్యావర్త పురాతన మహిమంతా అబ్బింది. నైనితాల్ మంగారామ్ మహరాజ్ తనను రాణిఖేట్‌లో వదిలిపోయాడు. రాణీఖేట్‌లో —ఆ సాధువు పాదధూళిని శిరస్సున ధరిస్తుండగా ఆయనొకవైపు తనను వెళ్ళమని నిర్దేశించాడు. రాణీఖేట్‌లో అది భారతసైన్యం రిక్రూటింగ్ ఆఫీస్. ఉక్కు కండల్తో, తీక్షణమైన చూపుల్తో, మిసిమి వర్ణంతో అపర వివేకానందుడిగా తమ ఎదుట నిలిచిన పతాభిని ఆ ఉదయాన్నే సైన్యంలో చేర్చుకున్నారు. శిక్షణ ప్రారంభమైనది. తన జీవితంలో కొత్త శకమూ ప్రారంభమైనదీ అప్పుడే. ఇప్పటికి రెండు మృత్యుదశలు దాటిపోయాడు. మొదటిది తన విద్యార్థి దశలో. రెండవది హిమాలయ యాత్రలో కాపాలికుల చేతిలో. ఇక ——

## III

పతాభి అసాధారణ ప్రజ్ఞ మరతుపాకుల వేగాన్ని అధ్యయనం చేయటం. తన తోటి సైనికులకు అన్ని నిబంధనలనూ నెట్టివేసి యోగవిద్యను నేర్పటంలో, ఆయుర్ధారిణీ మంత్రజపం ఉపదేశించటంలో, మృత్యుంజయ మంత్రంతో మెషిన్‌గన్‌ను సంధించటంలో, ఘనీభవించిన చలిలో హెవీ మెషిన్‌గన్స్‌ను కాపాడటంలో విదితమైంది. హిమాలయ ప్రాంతాల్లో, ప్రాణవాయువు కరువైన ఎత్తుల్లో యోగసాధనలతో పాటూ తనూ ఏడెనిమిదేళ్ళు ఎదిగాడు. అన్ని పరీక్షల్లోనూ అవలీలగా ముందుండేవాడు. నిబంధనలూ, రూల్సూ పుస్తకాలు ఒక లెక్కలోకి తీసుకోకుండా పతాభిని జనరల్స్ ఇంటర్వ్యూ చేసేవారు. కడపటగా సర్వీస్ సెలక్షన్ బోర్డులో అతనిను స్పెషలిస్ట్ కమీషన్డ్ ఆఫీసరుగా ఎన్నికయినాడు. మళ్ళీ అదే వేగం. చైనా దురాక్రమణ కాలంలో అతనికి ఫీల్డ్ ప్రమోషన్ —మేజర్ పతాభిగా. నాథులా కనుమ వద్ద జరిగిన మహా సంగ్రామంలో అతని యూనిట్‌లో ఎవరూ మరణించలేదు. మందుగుండు సామగ్రి అయిపోయింది. చైనీయుల అష్టదిగ్బంధనంలో యుద్ధ ఖైదీగా చిక్కిపోయాడు పతాభి, తిబెత్తు నుంచీ అతన్ని పెకింగ్‌కు పంపారు. ఎంత ప్రయత్నించినా బ్రెయిన్‌వాష్ పద్ధతులు ఈ అధికారి ముందు వ్యర్థమైపోయాయి. మూడు మాసాల నిర్బంధం తర్వాత తిరిగి భారత సైన్యానికి అప్పగింతలయినవి. ఆ అనుభవాలన్నీ క్రోడీకరిస్తే ఒక భారతపర్వం అవుతుంది. మేజర్ పతాభి హిమాలయ శిఖరాల మీద యుద్ధతంత్రాన్ని గురించి, చైనీయుల కుతంత్ర రాజకీయ సిద్ధాంతాల్ని గురించి, పాకిస్తాన్‌తో చెలిమిని గురించీ ఒక పెద్ద నివేదిక సమర్పించాడు. సైన్యం నుండి విడుదల లభించింది. కొద్ది దినాల్లోనే గెజెట్‌లో అతనికి అతి విశిష్ట సేవా మెడల్ పురస్కారం గురించి వార్త వచ్చింది. ఇల్లు లేని వాడు, నా అన్న వాళ్ళు లేని ఒక మాజీయుద్ధ ఖైదీ తిరిగి స్వదేశంలో అడుగు పెట్టాడు.

పాకిస్తాన్ నుంచి అనాథ బాలికగా వచ్చి కురుక్షేత్రంలో ఎదిగిన దమయంతి అనే ఉపాధ్యాయినిని పెండ్లాడాడు. ఇంకొక అనాథబాలుణ్ణి దత్తు చేసుకున్నాడు. ధర్మబద్ధమైన ఏ వ్యాపారం చేసినా అతనికి చేతినిండా ధనమే. యోగవిద్య సాధనకు, అనాథ శరణాలయాలకు విరివిగా దానం చేశాడు. రంగయ్య శ్రేష్ఠికి, ఆదెమ్మకూ, తన తల్లికీ స్థూపాలు కట్టించిందీ అనాథ శరణాలయాల్లోనే. పుట్టింటికి చేరిన చిట్టెమ్మను ఆదుకొన్నాడు. తనను హింసించిన బంధువర్గం గురించి మరిచిపొయ్యాడు. అన్ని రాజకీయాలను అసహ్యంగా తిలకించాడు.

తన భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్ణయించుకొనే స్థితిలో మరొక మృత్యువేదిక ఎదురైంది. దానినీ కాలతన్నాడు. కాని ఒక సమాధానం కొరకు వేచి ఉన్నాడు. తన జీవన సింహావలోకనం భారతదేశ చరిత్ర సింహావలోకనమే. శాంతిధామానికి పారిపోవటమా? భారతదేశమనే ఈ అగ్నిగుండాన్ని సంస్కరించే పూనిక చేయటమా? ఎదురుగా నిష్క్రమణ ద్వారం.

అంత బలహీనతలోనూ మేజర్ పతాభి ఎలుగెత్తి అరిచాడు —"ఆ ద్వారాన్ని మూసేయండి. మూసేయండి."

మూస్తున్నారో లేదో తను చూడలేదు. మగత కమ్మింది. యోగమాయ ఆవేశించింది. పతాభి మళ్ళీ ఉపనిషద్ మంత్రాల్లోని ఆయురుద్ధారక స్తోత్రాన్ని పఠిస్తున్నాడు. చుట్టూ మసకమసకగా మూగమూగగా వెలుగు. ఆ వెలుగులో భారతదేశ పటం కన్పిస్తున్నది. "ఆ ఉయ్యాలను ఆపు. ఆ చిలుకను పలకరించు."

★